# జీవగర్రలు

ఆ కూర్చున్నది నేనే కానీ యింకా అనుమానంగానే ఉంది నేనని చెప్పటానికి ధైర్యం చాలటంలా ఏం? ఎక్కడున్నాను? ఏంచేశాను? ఏం చేస్తున్నాను? అసలు నేనే అంటారా కాదంటారా? అహ పోనీ మీరు చెప్పండి చూద్దాం నేనే అయిఉంటానులెండి నేను 'నేను' కాకపోతే యిక్కడెందుకుంటాను చచ్చి చెడి యీ నిర్ధారణకు మాత్రం రావడం జరిగింది 'ఆ కూర్చున్నది నేనే అని.' అలాగైతే నాచుట్టూ ఉన్న 'నేను' లన్నీ కూడా యిలాటి నిర్ధారణకే వచ్చితీరాలి రావడం జరగాలి ఇది ముమ్మాటికీ నిశ్చయం

అసలు యింతకీ యీ అనుమానం ఎందుకు రావాలి? ఈ అనుమానం నాకొక్కడికే వచ్చిందా? నా శరీరారోగ్యం విషయంలో ఏం తేడా' పాడాగా లేదే. "ఏమండీ ఏం వంట్లో బాగోలేదా" అన్న ప్రశ్న నన్నెవ్వరూ వెయ్యలేదే! అక్కడ రోజూ కలుసుకుని, ఒకళ్ళ నొకళ్లం చూసుకొని పలకరించుకునే వాళ్లం ఆడా మగా అమాంబాపతు 60 మంది ఉంటాము "అలాగున్నా రేమండీ" అని గాని "ఏమండోయి మీరు మీరులాగా లేరే" అని గాని అన్నవారు ఒక్క ఆడగాని మగగాని లేకపోయె మరి దీని తస్సాదియ్యా ఈ అనుమానం నాకే ఎందుకు వచ్చిందో తెలియకుండా ఉంది

ఆ నాలుగు గోడలమధ్యా సద్దుకున్న వాళ్లం మేము అరవైమందీను. రోజూ గోడగడియారం 'టాంగ్' మని పదకొండు కొట్టేసరికల్లా అక్కడ హాజరుకావాలి. ఎక్కడ కొంపలంటుకున్నా, ఎక్కడ గోడలు కూలినా, చివరికి మా కొంపలోనే ఏదో అఘాయిత్యం వచ్చి పడిందన్నా సరే ఆఫీసు గడియారం అయిదు కొడితేనే గాని అరంగుళమైనా ఆ కూర్చున్న కుర్చీలోంచి కదలడానికివీలు లేదు ఒకనాటితో పోయేదా ఏమన్నానా నిత్యం చచ్చే వాడికి ఏడిచేవాడెవడు. ఏదో కొట్టుకు వస్తున్నాను. కాలం ఖర్మంగాలి ఏదో యీ దిక్కుమాలిన ఆఫీసులో గుమాస్తాగా చేరి, అహోరాత్రాలు ఏళ్లు తరబడి చేస్తూ అలాగే ఎదుగూ బొదుగూ లేకుండా ఉండిపోయానుగాని నేనూ F A అయినవాణ్నే వెనక

ప్రతీవాడూ కబుర్లు చెప్పేవాడే గాని క్రియచూపే వాడొక్కడూ కనబడడు దేశంలో పలుకుబడుందనుకున్న ప్రతీ వ్యక్తీ వస్తూండటం, ఏతోటలోనో దొడ్లోనో ఒకొక్క మీటింగు పెడుతూ ఉండటం, దేశం వాళ్ళమీద ఆధారపడి ఉంది అంటే వాళ్ళమీద ఆధారపడిఉంది అని ఎవరికి పెట్టిన మీటింగులో వాళ్ళను కాస్సేపు ఉబ్బేసి తన పని తను చేసుకుపోతూండడం "మీ కష్టాలేమిటయ్యా" అని కనుక్కున్న పెద్దమనిషి ఒక్కడూ కనపడడాయె 'పదిరూపాయలు జీతం పెంచండయ్యా చస్తున్నాము' అని నెత్తీ నోరూ మొత్తుకుని అధికారి అన్న ప్రతీవాడి చెవినీ నోరెట్టుకుని అరుస్తూంటే ఒకడైనా విన్నాడా, పాడా వెధవగొర్రెతోకకి ఎదుగూ లేదు బొదుగూ లేదన్నట్టు అలాగే ఉండవలసి వస్తూంది పైగా దేశానికంతకీ మా N G O 'పట్టుకొమ్మలని' ప్లాటుఫారాలమీద దంచుతూఉంటారు

ఏది ఎలాగున్నా జరిగేపనులు తప్పతాయామరి! మొగుద్రాళ్ళిద్దరికీ చదువులు తప్పవుకదా దేవుడిదయవల్ల చంటిదానికింకా గొడవలేదు ఏదో నాలుగు గోను గుడ్డలు కట్టిస్తే వదిలిపోయె అదృష్టవశాత్తూ భగవంతుడో నన్ను దయదలిచినాకు సంతానాన్ని జోరుగా ప్రసాదించలేదుగాని చచ్చేవాడ్ని. మా పెద్దాడికి ఏదో పదేళ్లు ముడ్డికిందకి వచ్చేయన్నమాటేగాని ఎందుకూ ఆస్కారం లేదు ఎదురుగుండా వీధిలో ఉన్న కొట్టుమీదికి వెళ్ళి కొబ్బరినూనె తేరా అంటే వాడికి చేతకాదు అయితే పాపం ఈ సాధక బాధకాలన్నీ పడటం మా ఆవిడికి తెలుసు' పగలస్తమానం పదకొండునుంచి అయిదుదాకా ఆఫీసులో కొట్టుకుంటూనే ఉంటారు ఇహ పొద్దున్న సాయంత్రం ఆయాస్నం చంపనని, పక్కింటివారి బంట్రోతువాడ్ని బతిమాలి యింటి ఛాకిరీ అంతా చేయిస్తూనే ఉంటుంది బతికేనురా బాబూ

అయితే ఏమిటి ఉపయోగం పదేళ్ళబట్టి కూర్చున్న కుర్చీలోనే కూర్చున్నానాయె ఈ దరిద్రపు ఆఫీసులో మా పెద్దాడు పుట్టినప్పుడు కాలెట్టేను అప్పుడెలా ఉన్నానో యిప్పుడూ అంతే ఆ కుర్చీకీ నాకూ ఈ వెధవ అవినాభావసంబంధం ఏమిటో, స్పర్శజ్ఞానం సగం చచ్చింది కుర్చీ చెయ్యిమీద చెయ్యి వేసినా ఒంటిమీదే వేసుకున్నాననుకోవడం దురదెట్టినా నాకాలేగదా అని ఆ కుర్చీని గోక్యడం యిలాటి ఎన్నో, ఆ కర్రతత్వం మనకీ మనతత్త్వం ఆ కర్రకీ ఎంతో కొంత కలిసిఉండాలి అలాగ కాకపోతే నన్ను ఆ కుర్చీని గోకడం ఎందుకు జరుగుతుంది? మొదట్లో వేసినప్పుడు గట్టిగాఉన్న కర్ర కుర్చీ యిప్పుడెందుకు మెత్తపడుతుంది?

సాయంకాలం ఆఫీసునుంచి లేటుగా యింటికి వచ్చాను కొత్త పెంద్రాళే 7½ అయేసరికల్లా భోజనంచేసి పడకకుర్చీలో కూలబడ్డాను మా పెద్దాడేదో పుస్తకంతీసి చదువుకుంటూ కంగారుగా నాదగ్గరికి వచ్చి "నాన్నా నాన్నా జీవంగలకర్ర లెక్కడన్నా ఉంటాయా? ఈ పుస్తకంలో జీవగర్రలని వ్రాసుంది" అని అమాయకంగా తను జీవంగల కర్రల నెప్పుడూ చూడలేదనే అనుమానంతో అడిగాడు మా కుర్రాడిని 'జీవగర్ర' అంటే 'పట్టుకొమ్మ" అనీ, అంటే 'వెన్నెముక' వంటిదని ఏదో అర్థం చెప్పివాడ్ని పంపేశాను.

నాకు పాతబడ్డవాక్యం ఒకటి గుర్తుకువచ్చింది "*The Wood entered into my soul*" అని అంటే కర్ర నా ఆత్మలో ప్రవేశించిందని ఒక్కసారిగా నాకు జీవముగల కర్రలూ, కర్రజీవాలూ ఉంటాయన్న ఆలోచన కలిగింది నమ్మకం పట్టింది దేశానికంతకీనూ N G O లే "పట్టుకొమ్మలు" జీవగర్రలు జీవముగల కర్రలు కర్రజీవాలు యింక జీవగర్ర అంటే నేనే నేనుకాదని సందేహించవలసిన అవసరమేముంది? నిస్సందేహంగా ముమ్మాటికీ నేనే జీవగర్రను రాత్రి ఎలాగో నిద్రపట్టింది

తెల్లవారింది పదకొండయింది. మామూలుగా ఆఫీసుకుర్చీలో కూర్చున్నా. సాయంకాలం అవుతూవుంది—నాకు సందేహం వచ్చింది; ఆ కూర్చున్నది 'నేనేనా' అని ★

శ్రీ రా. సీ. రామచంద్రరావు